


# మనఃపూర్వకముగా

**మూలవాక్యము:-**

**యాకో 5:16** మీ పాపములను ఒకనితో నొకడు ఒప్పుకొనుడి; మీరు స్వస్థత పొందునట్లు ఒకని కొరకు ఒకడు ప్రార్థన చేయుడి. నీతిమంతుని విజ్ఞాపన మనఃపూర్వకమైనదై బహుబలము గలదై యుండును.

సర్వ సాధారణంగా మనుష్యుల స్వభావము ఎలా ఉంటుందంటే ఏదైనా ఒక పని చేయాలన్నా, ఏదైనా ఇవ్వాలన్నా, పిలవాలన్నా రెండు రకాలుగా చేస్తారు. ఒకటి ఫార్మాలిటి కోసము. రెండు మనః పూర్వకముగా చేస్తారు.

ఏదైనా ఒక శుభ కార్యానికి మనము ప్రజలను (బంధువులను గాని, స్నేహితులను గాని ) ఆహ్వానించునప్పుడు మనఃపూర్వకముగా ఆహ్వానించడానికి, మాములుగా ఆహ్వానించడానికి వ్యత్యాసం ఉంటుంది. దేవుడు మన హృదయ అంతరంగములను ఎరిగిన వాడు కనుక దైవ సంబంధమైన విషయాలలో మనము ఏమి చేసిన మనఃపూర్వకముగా చేయాలి. మనఃపూర్వకముగా మనము చేయవలసిన సంగతులను పరిశుద్ధ గ్రంధంలో నుండి ధ్యానం చేసుకుందాం.

**1. మనఃపూర్వకముగా దేవుని యొద్దకు రావాలి:- యోవే 2:12**

ఇప్పుడైనను మీరు ఉపవాసముండి కన్నీరు విడుచుచు దుఃఖించుచు మనఃపూర్వకముగా తిరిగి నా యొద్దకు రండి. ఇదే యెహోవా వాక్కు.

**2. మనఃపూర్వకముగా దేవుడిని వేడుకోవాలి:- యోనా 3:9**

మనుష్యులందరు తమ దుర్మార్గములను విడిచి తాము చేయు బలాత్కారమును మానివేయవలెను, మనుష్యులేమి, పశువులేమి సమస్తమును గోనెపట్ట కట్టుకొనవలెను, జనులు మనఃపూర్వకముగా దేవుని వేడుకొనవలెను అని దూతలు నీనెవె పట్టణములో చాటించి ప్రకటన చేసిరి.

**3. మనఃపూర్వకముగా దేవునికి ఇవ్వాలి:- 1దిన 29:17**

నా దేవా, నీవు హృదయ పరిశోధన చేయుచు యథార్థవంతుల యందు ఇష్టపడుచున్నావని నేనెరుగుదును; నేనైతే యథార్థహృదయము గలవాడనై యివియన్నియు మనఃపూర్వకముగా ఇచ్చియున్నాను. ఇప్పుడు ఇక్కడ నుండు నీ జనులును నీకు మనఃపూర్వకముగా ఇచ్చుట చూచి సంతోషించుచున్నాను.

**నిర్గమ 36:3:-**

ఆ పని చేయుటకై వారు పరిశుద్ధ స్థలము యొక్క సేవ కొరకు ఇశ్రాయేలీయులు తెచ్చిన అర్పణములన్నిటిని మోషే యొద్ద నుండి తీసికొనిరి. అయినను ఇశ్రాయేలీయులు ఇంక ప్రతి ఉదయమున మనఃపూర్వకముగా అర్పణములను అతని యొద్దకు తెచ్చుచుండిరి.

**4. మనఃపూర్వకముగా అర్పించే మనిషి యొద్ద మాత్రమే తీసుకోవాలి:- నిర్గమ 25:2**

నాకు ప్రతిష్ఠార్పణ తీసికొనిరండని ఇశ్రాయేలీయులతో చెప్పుము. మనఃపూర్వకముగా అర్పించు ప్రతి మనుష్యుని యొద్ద దాని తీసికొనవలెను.

**5. మనఃపూర్వకముగా దేవుని సేవించాలి:- 1దిన 28:9**

సొలొమోనా, నా కుమారుడా, నీ తండ్రి యొక్క దేవుడైన యెహోవా అందరి హృదయములను పరిశోధించువాడును, ఆలోచనలన్నిటిని, సంకల్పములన్నిటిని ఎరిగినవాడునైయున్నాడు. నీవు ఆయనను తెలిసికొని హృదయపూర్వకముగాను మనఃపూర్వకముగాను ఆయనను సేవించుము. ఆయనను వెదకిన యెడల ఆయన నీకు ప్రత్యక్షమగును, నీవు ఆయనను విసర్జించిన యెడల ఆయన నిన్ను నిత్యముగా త్రోసివేయును.

**6. మనఃపూర్వకముగా దేవుని పని చేయాలి:- 1దిన 28:21**

దేవుని మందిర సేవయంతటికిని యాజకులును లేవీయులును వంతుల ప్రకారము ఏర్పాటైరి; నీ యాజ్ఞకు బద్ధులైయుండి యీ పని యంతటిని నెరవేర్చుటకై ఆ యా పనులయందు ప్రవీణులైన వారును మనఃపూర్వకముగా పని చేయు వారును అధిపతులును జనులందరును నీకు సహాయులగుదురు.

**7. మనఃపూర్వకముగా దేవుని చిత్తము జరిగించాలి:- ఎఫె 6:6**

మనుష్యులను సంతోషపెట్టువారు చేయునట్లు, కంటికి కనబడుటకే కాక క్రీస్తు దాసులమని యెరిగి దేవుని చిత్తమును మనఃపూర్వకముగా జరిగించుచు

**ముగింపు:-**

**మనఃపూర్వకముగా ఇచ్చువారు మీలో ఉన్నారా:- 1దిన 29:5**

ఈ దినమున యెహోవాకు ప్రతిష్ఠితముగా మనఃపూర్వకముగా ఇచ్చు వారెవరైన మీలో ఉన్నారా?

మనము కలిగియున్నవన్నియు అనగా మన ప్రాణాత్మ దేహములు అలాగుననే మన సమయం, మన ధనము సమస్తమును దేవునికి మనఃపూర్వకముగా అర్పించు శ్రేష్ఠమైన జీవితం పరిశుద్ధాత్మ దేవుడు మనకు అనుగ్రహించును గాక.